క్లుప్తంగా

పారిశుధ్య సామగ్రి అందజేత



పారిశుధ్య కార్మికులకు సామగ్రి అందజేస్తున్న కార్పొరేటర్ కామేశ్వరి

కంచరపాలెం: జీవీఎంసీ 47వ వార్డు రాంజీ ఎస్టేట్ శానిటరీ కార్యాలయంలో బుధవారం పారిశుధ్య కార్మికులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కోట్లు, మాస్కులు, గ్లౌజులు, చీపుళ్లు, ఆయిల్ తదితర సామగ్రిని కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనలో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యముందన్నారు. పారిశుధ్య సిబ్బంది తమ విధి నిర్వహణలో భాగంగా వార్డులోని ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమణమూర్తి, కె.విజయ్, వి.అప్పారావు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

7న పౌర్ణమి పూజలు

సీతంపేట: పౌర్ణమి సందర్భంగా లలితానగర్ లలితా పీఠంలో ఈ నెల 7న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 8.30 గంటలకు అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ అర్చన, 10 గంటలకు లలితాదేవి హోమం జరుగుతాయన్నారు. పూజల్లో పాల్గొన దలచిన భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

కానరాని నేమ్ బోర్డు



నేమ్ బోర్డు లేని సీతమ్మధార రైతుబజార్

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌కు నేమ్ బోర్డు ఏర్పాటు చేయాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు. గత నెల రైతుబజార్‌లో కంటైనర్ ఏర్పాటు చేయడంతో నేమ్ బోర్డు తీసివేయాల్సి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు రైతుబజార్‌కు తిరిగి నేమ్ బోర్డు అమర్చ లేదు. అధికారులు పరిశీలించి నేమ్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ముందుగా ఆలయ కార్యనిర్వహణాధికారి రామాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పసుపుతో అలంకరించి, హారతులిచ్చారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న ఎరుకుమాంబను అధిక సంఖ్యలో భక్తులకు దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



విష్ణుమూర్తి (ఫైల్)

గోపాలపట్నం: లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన కాకానినగర్ వద్ద చోటు చేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం దరి యల్లపువానిపాలేనికి చెందిన వావిలపల్లి విష్ణుమూర్తి (28), అతని స్నేహితుడు ఉప్పాడ భాగ్యరాజ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి మాధవధార వెళ్తున్నారు. కాకానినగర్ రైల్వే బ్రిడ్జ్ సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో వాహనం నడుపుతున్న విష్ణుమూర్తికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెనుక కూర్చున్న భాగ్యరాజు ఆటోలో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లి, తండ్రి అన్న ఉన్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ఎస్ఐ శివకుమార్ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆహ్లాదం.. ఆరోగ్యం



మాధవధార ఈస్ట్ పార్కులో వ్యాయామం చేస్తున్న స్థానికులు

- నందర్శకులను ఆహ్వానిస్తున్న మాధవధార పార్కులు
- అందుబాటులో జిమ్, ఆట పరికరాలు
- వ్యాయామం, ఆటలతో చిన్నాపెద్దల సందడి

మర్రిపాలెం: ఆహ్లాదం.. ఆరోగ్యం.. కాలక్షేపానికి చిరునామాగా మాధవధారలోని పార్కులు నిలుస్తున్నాయి. వేసవి కాలం వచ్చిందంటే చాలు.. ఎప్పుడెప్పుడు సాయంత్రం అవుతుందా.. కాసేపు సరదాగా బయట గడిపేద్దామా.. అని ప్రజలు ఎదురుచూస్తుంటారు. ఆ ఆహ్లాదానికి పచ్చదనం, చల్లని గాలి తోడైతే ఇక వారి స్వేచ్ఛకు హద్దులు ఉండవు. అలాంటి ఒక ప్రకృతిని తలపించే ప్రాంతమే మాధవధార. చుట్టూ కొండలు, పచ్చదనం నడుమ ఉన్న ఈ ప్రాంతంలో జీవీఎంసీ నిర్మించిన పార్కులు.. ఎటు చూసినా దైవ దర్శనమిచ్చే గోపురాల్లా కనిపిస్తాయి. 51వ వార్డు మాధవధారలో దాదాపు 5 నుంచి 10 వరకు ఉద్యానవనాలు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్నింటిలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. మారుతున్న జీవనశైలికి అనుగుణంగా చిన్నాపెద్దా అని తేడా లేకుండా వ్యాయామం చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. అనారోగ్య సమస్యలు పెరిగిపోవడంతో రోజువారి జీవన విధానంలో మార్పులు చేసుకునే తరుణంలో వేకువజామునే నిద్ర లేచి వాకింగ్ చేస్తున్నారు.

ఓపెన్ జిమ్స్‌లో సదుపాయాలు..

జీవీఎంసీ పార్కుల్లోని ఓపెన్ జిమ్స్‌లో హిప్ రొటేటర్, స్టమక్ రొటేటర్, సైక్లింగ్, కాలి ఊయాల, హ్యాండ్ రొటేటర్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. చిన్న పిల్లలు ఆడుకోవడానికి జారుడు బల్లలు, ఊయలలు తదితర పరికరాలు ఏర్పాటు చేశారు. అందరూ వాకింగ్ చేసేందుకు వీలుగా ట్రాక్‌లు నిర్మించారు. షటిల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటలకు సంబంధించి ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. సాయంత్రం వేళ స్థానిక యువత, పిల్లలు, పెద్దలు పార్కుల్లో వ్యాయామాలు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.



వుడా కాలనీలోని సిద్ధార్థ పార్కు

వేసవిలో సరదాగా గడిపేందుకు..

ముఖ్యంగా వేసవి కాలం వచ్చిందంటే మాధవధార వుడా కాలనీలోని జీవీఎంసీ ఈస్ట్ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో దాదాపు 400 నుంచి 500 మంది వరకు సందర్శకులను చూడొచ్చు. మాధవధార వుడా కాలనీ సిద్ధార్థ పార్కులో ఓపెన్ జిమ్ పరికరాలు ఉన్నాయి. మగవారు, పిల్లలు బ్యాడ్మింటన్, షటిల్‌కాక్ వంటి ఆటలు ఆడుతున్నారు. వుడా కాలనీ జీవీఎంసీ సెంట్రల్ పార్కు, పద్మావతి పార్కు, ఎంఎన్‌ఆర్ పార్కుల్లో ప్రస్తుతం సందడి వాతావరణం నెలకొంటోంది. అందరూ ఉత్సాహంగా వ్యాయామం, ఆటపాటలతో సరదాగా గడుపుతున్నారు. ఈ పార్కుల్లో కొన్ని చిన్న చిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తే ఆదరణ బాబా పెరుగుతుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పార్కులు ఉపయోగకరం



మాధవధారలోని పార్కులు అందరికీ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. పిల్లలు, పెద్దలు, మహిళలందరూ సేదతీరడానికి, వ్యాయామం చేయడానికి, కాసేపు జాలీగా గడపడానికి చాలా బాగుంటుంది. ఒక రకంగా ఆరోగ్యానికి ఆరోగ్యం, కాలక్షేపం కూడా ఉంటుంది.

– హేమలత, మహత్‌నగర్

ఓపెన్ జిమ్‌లతో ఆనందం



పార్కుల్లో ఓపెన్ జిమ్‌ల ఏర్పాటు చాలా బాగుంది. పిల్లలు, పెద్దలు, మహిళలు ఆనందంగా గడుపుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు సాయంత్రం వచ్చి వాకింగ్ చేసుకుని, కాసేపు కబుర్లు చెప్పుకుంటూ రాత్రి 8 గంటల వరకు ఇక్కడే గడుపుతున్నారు.

– తులసీరావు, కళింగనగర్

చురుగ్గా పింఛన్ల పంపిణీ



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పెన్షన్ అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు



49వ వార్డులో పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

సీతమ్మధార: నియోజకవర్గంలో బుధవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగింది. వేకువజాము నుంచే సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిసర కాలనీల్లో అవ్వాతాతలు, ఇతర లబ్ధిదారులకు కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు చేతుల మీదుగా పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో చెప్పిన సమయానికే అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. లబ్ధిదారులంతా సంతోషంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో బల్లా శ్రీను, కె.సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

49, 51, 53 వార్డుల్లో..

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు 282 కన్వీనర్‌గా క్లస్టర్ సీ–3, 4, 5ల్లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. వార్డులోని అన్ని సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము అందించారు.



51వ వార్డులో పింఛన్లు అందజేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

- 51వ వార్డులో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ 289 సచివాలయం పరిధిలోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. వార్డులోని అన్ని సచివాలయాల పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు పింఛన్ సొమ్ము పంపిణీ చేశారు.
- 53వ వార్డులో అవ్వాతాతలు, వితంతువులకు కార్పొరేటర్ బర్కత్ అలీ పింఛన్లు అందజేశారు.

50వ వార్డులో..

మురళీనగర్: జీవీఎంసీ 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ సూచనల మేరకు సచివాలయ కన్వీనర్లు ఎస్.నారాయణస్వామి, ఎస్.రమేష్‌కుమార్ వార్డులోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు. తొలి రోజు 100 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గృహసారథులు రవికుమార్ స్వామి, కమల పాల్గొన్నారు. వానప్రస్థ వృద్ధాశ్రమంలోని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి

కంచరపాలెం: సీనియర్ మెడికో వేధింపులకు బలైన వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ విద్యార్థిని ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కోరారు. ఆమె ఆత్మహత్యకు కారణమైన నిందితుడు సైఫ్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ కులానికి చెందిన ప్రీతిని ర్యాగింగ్ చేసి చిత్రహింసలకు గురిచేయడంతో ఆత్మహత్యకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బాధిత కుటుంబానికి న్యాయం చేసి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, ప్రధాన కార్యదర్శి మల్లికార్జున రావు, నగర కన్వీనర్ గొల్లమాల మీనా, కార్యదర్శి పట్నాల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న దళిత సేన నేతలు

విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం



మాట్లాడుతున్న గజల్ గాయని జ్యోతిర్మయి

సీతంపేట: కవులందరూ కవిత్వ తత్వాన్ని అలవర్చుకోవాలని గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రిజమ్ కళాశాలలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనసులను కదిలించే ప్రేమ, జాలి, కరుణ, కళాత్మకత రంగరించి విశ్వజనీనత ప్రతిబింబించేలా కవిత్వం ఉండాలని సూచించారు. పలు గజల్స్ పాడి వినిపించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ కవిత్వాన్ని వివిధ పద్ధతుల్లో వ్యక్తీకరించవచ్చని, అందులో పద్యం, వచన కవిత, లఘు కవితా రీతులైన నానీలు, హైకూలు, రెక్కలు మొదలైన ప్రక్రియలే కాకుండా పారశీక ప్రక్రియ గజల్స్ బాగా ప్రాచుర్యం పొందాయన్నారు. అటువంటి గజల్స్ ప్రక్రియలో రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ బాగా పేరొందిన కవయిత్రి గజల్ గాయని జ్యోతిర్మయి మళ్ల అని కొనియాడారు. రచయిత కె.జి.వేణు మాట్లాడుతూ ఇటీవల మరణించిన గజల్ కవయిత్రి భైరి ఇందిర గురించి, ఆమె కవిత్వంలోని విశేషాలను వివరించారు. సాహితీవేత్తలు, రచయితలు కె.వి.ఎస్.మూర్తి, డి.వి.సూర్యారావు, పి.ఎల్.వి.ప్రసాద్, చిన సూర్యనారాయణ, రామతాత, రమణకొత్తూరి కవితలు వినిపించారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత భానుప్రకాష్‌రెడ్డి మృతి



కె.భానుప్రకాష్‌రెడ్డి (ఫైల్)

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర రెడ్డి వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్ప భానుప్రకాష్‌రెడ్డి(55) బుధవారం రాత్రి కన్నుమూశారు. వారం రోజుల కిందట ఆరిలోవ హెల్త్‌సిటీ అపోలో హాస్పిటల్‌లో అనారోగ్యంతో చేరిన ఆయన చికిత్స పొందుతూ మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. శ్రీకాకుళం జిల్లా మెలియపుట్టి గ్రామానికి చెందిన భానుప్రకాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీలో సీనియర్ నాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన మృతితో మెలియపుట్టి గ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం తెలిపారు.

ఆయుర్వేద వైద్య శిబిరం రేపు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రంలో ఈ నెల 3న ఉచిత ఆయుర్వేద వైద్య చికిత్స శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం విభాగాధిపతి డాక్టర్ కె.రమేష్‌బాబు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో ఈ శిబిరం జరుగుతుందన్నారు.

వాకర్స్ పార్కులో విద్యుత్ వెలుగులు



వాకర్స్ పార్కులో వెలగని విద్యుత్ లైటు (నాడు)



వెలుగుతున్న విద్యుత్ లైటు (నేడు)

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో విద్యుత్ వెలుగులు సంతరించుకున్నాయి. ఇక్కడి వీధిలైట్లు కొద్ది కాలంగా వెలగడం లేదు. పార్కులో సాయంత్రం వేళ సందర్శకులు, వాకర్స్ ఇబ్బందులు పడేవారు. చీకట్లో అసౌకర్యానికి గురయ్యేవారు. దీనిపై స్థానిక వాకర్స్ క్లబ్ సభ్యులు జీవీఎంసీ విద్యుత్ విభాగం ఏఈ అన్నంనాయుడుకు సమాచారం అందించారు. ఆయన చర్యలు తీసుకుని మూడు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేయించారు. బుధవారం రాత్రి నుంచి ఇవి పనిచేస్తున్నట్లు క్లబ్ నిర్వాహకులు చెప్పారు. సకాలంలో స్పందించి సమస్య పరిష్కరించినందుకు ఏఈకి వాకర్స్ క్లబ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలికల హాస్టల్‌కు రక్షణ గేటు

సొంతంగా తయారు చేసిన గైస్ విద్యార్థులు



విద్యార్థులు తయారు చేసిన రక్షణ గేటు



గేటు తయారీలో నిమగ్నమైన విద్యార్థులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్) విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. వీరు స్థానిక వనరులను వినియోగించుకుని తమ కళాశాల ప్రాంగణంలో సౌకర్యాలను సమకూర్చుకుంటున్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ ఆధ్వర్యంలో స్వయం సమృద్ధి సాధన కార్యక్రమాలతో విజయవంతంగా సాగుతున్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి సూచనల మేరకు ప్రిన్సిపాల్ స్థానిక వనరులు వినియోగిస్తూ సౌకర్యాలు కల్పించారు. ఈ కాలేజీలో బాలికల కోసం ప్రత్యేకంగా వసతీ గృహాన్ని తెరిచారు. ఇందులో 60 మంది డిప్లొమా చదువుతున్న విద్యార్థినులు ఆశ్రయం పొందుతున్నారు. వీరి హాస్టల్‌కు గేటు సదుపాయం లేదు. దీంతో ప్రిన్సిపాల్ వెంకటరమణ స్థానిక ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులు, కాలేజీలోని వర్క్‌షాప్ సిబ్బందిని సమన్వయపరిచి గేటు సమకూర్చారు. దీనిని ఏర్పాటు చేయాలంటే కనీసం రూ.60,000 నిధులు కావాలి. అతి తక్కువ ఖర్చుతో స్థానికంగా గేటు తయారు చేశారు. ఇందు కోసం కాలేజీ జనరల్ ఫండ్ నుంచి రూ.25,000 మాత్రమే సమకూర్చారు. ఈ నిధులతోనే విద్యార్థులు గేటును రూపొందించారు. తమ ప్రయోగాత్మక అభ్యసనంలో భాగంగా దీన్ని తయారు చేసినట్లు వారు చెప్పారు. దీంతో హాస్టల్ బాలికలకు పూర్తి రక్షణ ఏర్పడిందని ప్రిన్సిపాల్ తెలిపారు. గతంలో ఇదే ప్రాంగణంలో అతి తక్కువ ఖర్చు రూ.1.50 లక్షలతో గేల్వనైజ్డ్ షీట్‌లతో ప్రహరీ గోడ నిర్మించారు. తమ రక్షణకు పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటున్నందుకు ప్రిన్సిపాల్ వెంకటరమణకు విద్యార్థినులు కృతజ్ఞతలు తెలిపారు.

అంగరంగ వైభవంగా ఎల్లమ్మ జాతర



జాతరలో జన సందోహం



అమ్మవారిని తోడ్కొని వస్తున్న భక్తులు

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం ఎల్లమ్మ జాతర బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. జగదాంబ జంక్షన్ వద్ద వెలసిన ఆలయం వద్ద వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారితోపాటు ఆమె సోదరుడు పోతురాజుకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని పలువురు ప్రముఖులు, దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారులు దర్శించుకున్నారు. ఎల్లమ్మతోట, చాకలిపేట, కనకల వీధి, కుమ్మర వీధి, డిబ్బలపాలెం, ప్రకాశరావుపేట, మహారాణిపేట, అంగటిదిబ్బ, దాబాగార్డెన్స్, సూర్యాబాగ్, బొద్దునాయుడు తోట, లలితానగర్ తదితర ప్రాంతాలతోపాటు విజయనగరం, శ్రీకాకుళం, భీమిలి, కొత్తవలస తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వర థియేటర్ సమీపంలోని ఎల్లమ్మతల్లి పుట్ట వద్ద మాలధారులు శూలాల ప్రదర్శన చేపట్టారు. అగ్నిగుండం తొక్కారు. అమ్మవారి దర్శనం కోసం ఎల్లమ్మ గుడి నుంచి జగదాంబ జంక్షన్ వరకు క్యూ లైన్లు బారులు తీరాయి. అమ్మవారి పుట్ట, పోతురాజు పుట్ట వద్ద భక్తులు అధిక సంఖ్యలో పూజలు చేశా రు. పసుపు, కుంకు మ, మొక్కులు సమర్పించుకున్నారు. టూటౌన్, మహారాణిపేట పోలీసులు భద్రత చర్యలు చేపట్టారు. పలు స్వచ్ఛంద సంస్థలు ప్రసాదం పంపిణీ చేశాయి. ఆలయ ఈవో కె.పద్మావతి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

తొలేళ్లతో ప్రారంభం..

మహాశివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారి జాతర ముందు రోజున(మంగళవారం) అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ జిల్లెలమూడు వీధిలోని జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మ అమ్మవారు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెట్టి అక్కడి నుంచి మేళతాళాలతో అమ్మవారిని తీసుకొచ్చారు.

జోరందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



సీతంపేట గణేష్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కె.కె.రాజు, గోవింద్



బుల్లయ్య కళాశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్



53వ వార్డులో పట్టభద్రులకు కరపత్రాలను అందిస్తున్న బర్కత్ అలీ

సీతంపేట: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ బుధవారం 25వ వార్డు గణేష్‌నగర్‌లో కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ సారిపిల్లి గోవింద్‌తో కలిసి నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భోగవిల్లి గోవింద్, సారిపిల్లి సంతోష్, సానబోయిన సురేష్, పోతిబంతి హరి తదితరులు పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలలో..

డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డితో కలిసి సీతంరాజు సుధాకర్, కె.కె.రాజు ఎన్నికల ప్రచారం చేశారు. కళాశాల లెక్చరర్లు, సిబ్బందిని కలిసి సీతంరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. పార్టీ నాయకులు కిరణ్‌రాజు, ఆళ్ల శివగణేష్, కర్రి మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించండి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పట్టభద్ర ఓటర్లను అభ్యర్థించారు. పార్టీ నాయకులు సాడి కేశవరెడ్డి, మురళీకృష్ణ, లావణ్య, కుసుమ, కృష్ణారెడ్డి, అప్పలరెడ్డి, కామేశ్వరరెడ్డి, శివ, శివరంజని పాల్గొన్నారు.

49వ వార్డులో..

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డులో కార్పొరేటర్ అల్లు శంకరరావు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి 282 సచివాలయం పరిధి మాణిక్యాంబ కాలనీ, పట్టాభిరెడ్డి తోట ప్రాంతాల్లో పర్యటించి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరుతూ కరపత్రాలను అందజేశారు.

53వ వార్డులో..

మర్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు మర్రిపాలెం రామాలయం వీధి, భాస్కర్ గార్డెన్స్ రాణాప్రతాప్ నగర్ ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి కార్పొరేటర్ బర్కత్ అలీ ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని పట్టభద్రులను కోరుతూ కరపత్రాలు అందజేశారు.

54వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ కూడలి, 104 ఏరియా ప్రాంతాల్లో కార్పొరేటర్ చల్లా రజని ప్రచారం చేశారు. సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ కంచరపాలెం పారిశ్రామిక శిక్షణ కేంద్రం, జిల్లా ఉపాధి కార్యాలయం, కప్పరాడ పాఠశాలల్లో పట్టభద్రులకు కరపత్రాలు అందించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, చిరంజీవి, రాధాకృష్ణ, దిలీప్, సోమేష్, రాంబాబు, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

శిథిలమైన డంపర్ బిన్లు



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పాడైన డంపర్ బిన్

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపర్ బిన్లు శిథిలమయ్యాయి. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో రంధ్రాలు ఏర్పడిన డంపర్ బిన్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో చెత్త బయటకు వచ్చి దుర్గంధం వెలువడుతోంది. కుక్కలు, పశువులు అక్కడ చేరి వ్యర్థాలను చెల్లాచెదురు చేయడంతో పరిసరాలు పాడవుతున్నాయి. పారిశుధ్య అధికారులు పరిశీలించి డంపర్ బిన్లకు మరమ్మతులు లేదా కొత్త వాటి ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

– కె.రత్నంరాజు, బాలయ్యశాస్త్రి లేఅవుట్